**కథ**

# నువ్వంటే నాకిష్టం

**ఆత్మకూరు భారతి**

**'దుర్మార్గుడా! ఇంటికిరా అయిపోయావు ఇవాళ నా చేతిలో' కుతకుతలాడిపోతుంది లావణ్య మనసు. 'ఎంత ధైర్యం. వాత పెడ్తేగానీ బుద్ధిరాదు. ఇంటికిరా చెబ్తా' తిట్టుకుంటూ ఇల్లు సర్దుతోంది.**

గంట క్రితమే ఊర్నుండొచ్చింది లావణ్య. రెండు నెలలు ఊర్లో లేకుండా ఉండేటప్పటికి ఇల్లంతా చెత్త కుప్పలా ఉంటుందని ఊహించింది. దానికి విరుద్ధంగా శుభ్రంగానే ఉంచుకున్నాడు ఫ్లాట్‌ని. మొక్కలు కూడా అన్నీ పచ్చగానే ఉన్నాయి. కారిడార్‌లో గాలి తగిలేలాగా ఉంచిన లవ్ బర్డ్స్ కువకువలాడుతున్నాయి.

'అన్నీ జాగ్రత్తగానే చూసుకుంటున్నాడన్నమాట, గుడ్‌బోయ్' తృప్తిగా తలాడించింది లావణ్య.

సెంట్రల్ గవర్నమెంట్‌లో ఉద్యోగం చేస్తున్న శ్రీకర్ ప్రేమగా 'లవ్' అని పిలుచుకునే ముద్దుల పెళ్ళాం లావణ్య. పెళ్ళయి నాలుగేళ్ళయింది గానీ ఇంకా పిల్లల్లేరు. ఇద్దరికీ ఉద్యోగాలవడంతో కాలం సాఫీగానే సాగిపోతోంది.

"అదేంటమ్మా ఇంకా పిల్లల్లేరు. నాకు తెలిసిన బాబా ఒకాయన తాయెత్తు కడ్తే పిల్లలు పుడ్తారట. రమ్మంటే నేనొచ్చి తీసికెళ్తాను. కావాలంటే ఒకసారి అయ్యగారిని అడిగి చూడండి" అనింది గిన్నెలు తోముతూ పనిమనిషి ఒకరోజు.

"పిల్లలుంటే బాగానే ఉంటుంది. అందరూ ఈమధ్య ఇదే అడుగుతున్నారు. నేను ఆ తాయెత్తు కట్టించుకోనా" అడిగింది లావణ్య ఆరోజు రాత్రి శ్రీకర్‌ని.

"పిల్లలు తాయెత్తులు వల్లా, విభూతులవల్లా పుట్టర్రా. నన్ను నమ్ముకో ఫలితం ఉంటుంది" అల్లరిగా చుట్టేసాడు శ్రీకర్ లావణ్యని.

ఎంత చెట్టుకి అంతగాలి అన్నట్టూ ఇద్దరి జీతాలైనా చెల్లెలి పెళ్ళి, అప్పులూ, ఖర్చులూ, వడ్డీలూ అన్నీ ఉండనే ఉన్నాయి. అన్ని ఖర్చులూ పోగా మిగిలిన డబ్బుల్తో నవ్వులు కొనుక్కోవడమెలాగో ప్లాన్ చేసుకునే వాళ్ళు. రోజూ సాయంత్రం ఆఫీసు నుంచొస్తూ కాసిని మల్లెపూలు, వారం వారం సినిమా, ఏమీ తోచకుంటే కూరగాయల పేరుతోనన్నా జంటగా చేసే షాపింగులతో కాలం సరదాగా గడిచిపోతోంది.

"త్వరగా ఇల్లు సర్దేసి కాసింత వంట చెయ్యాలి. పాపం పొద్దున ఏం చేసుకున్నాడో ఏమో, వచ్చే ముందు చెప్పలేదు గదా. చూడగానే థ్రిల్ అవుతాడేమో" లావణ్య మనసులో ముసురుకున్న సంతోషం.

బెడ్‌పైనంతా పరిచినట్లు తన ఉత్తరాలే. ఎప్పుడూ ఉత్తరాలు రాయమని ఒకటే గొడవ. తీరా రాసాక ఇదిగో చదివి ఎక్కడంటే అక్కడే పడేస్తాడు. వేరే ఎవరన్నా చదువుతారనే సిగ్గు కూడా లేదు. అదే అంటే, "అది అజాగ్రత్త కాదు బంగారూ, నా బెడ్ పైన, జేబులో, బ్యాగ్‌లో అన్ని దగ్గర్లా నీ ఉత్తరాలున్నాయనుకో ఎప్పుడు దిగులేసినా చదూకోవచ్చు. నీ లెటర్ బలమిచ్చే టానిక్ అన్నమాట" ఇట్లాటి వాళ్ళతో ఏం మాట్లాడతాం.

పెళ్ళయిన కొత్తలో అందరి ఆడపిల్లల్లాగానే ముందు జీవితం ఎలా ఉంటుందోనని భయపడింది లావణ్య. అందునా కట్నం విషయంలో రెండు, మూడు సంబంధాలు తప్పిపోవడంతో ఇంట్లో కంగారు మొదలయింది. వచ్చిన వాళ్ళంతా అమ్మాయి కాసింత రంగు తక్కువ గనక ఉద్యోగమున్నాసరే మరో లక్ష కట్నమిస్తే బాగుంటుందని వెనక్కెళ్ళిపోయారు. రంగు తక్కువయినా చూడగానే ఆకట్టుకునేలా పొందిగ్గా ఉంటుంది లావణ్య. మరో లక్ష కట్నమిస్తే తన చామనచాయ తెలుపెలా అవుతుందో అర్థమవలేదు లావణ్యకి. తర్వాత ఎవరి ఇంట్లోనో చూసాడంటూ వచ్చిన సంబంధం శ్రీకర్‌ది. పెళ్ళిచూపుల్లో శ్రీకర్‌ని చూడగానే నిర్ణయించుకుంది లావణ్య ఇదీ కుదిరే వ్యవహారం కాదని. శ్రీకర్ పసిమిరంగులో, చూడ్డానికి సినిమా హీరోలా తోచాడు.

'బండగా ఉండేవాళ్ళే వద్దంటే, చిరంజీవిలా ఉన్నాడు. ఇక ఈయనకేం నచ్చుతాను. ఊరకే టిఫిన్ ఖర్చు, ఒక పట్టుచీరకి ఇస్త్రీ దండగ' అనుకుంది. ఊహించనట్టూ పిలుపొచ్చింది శ్రీకర్ వాళ్ళింటినుంచీ వారం తర్వాత. పిల్ల నచ్చింది. కట్నం కానుకల పట్టింపుల్లేవు, ముహూర్తాలు పెట్టించమని.

పెళ్ళిలో లావణ్య స్నేహితులంతా ఆటపట్టించారు "అసలే అందంగా ఉన్నాడేవ్ జాగ్రత్త. పెళ్ళి అయ్యాక కూడా ఎవరేనా ఎగరేసుకెళ్ళొచ్చు" అంటూ. మంచి సెన్సాఫ్ హ్యూమర్‌తో, గలగల మాట్లాడ్తూ అందరినీ కలుపుకుపోయే తత్వమున్న శ్రీకర్ వెంటనే నచ్చేశాడు లావణ్యకు. కాకపోతే మగవాళ్ళతోలాగ, ఆడవాళ్ళతో కూడా అలా మాట్లాడ్డం ఇబ్బందన్పించింది. కాసింత బెరుకు తగ్గాక అదే అని చూస్తే "ఏంటీ కుళ్ళుకుంటున్నావా" అంటూ నవ్వేసాడు.

చలికాలమవడంతో త్వరగా చీకటిపడ్తున్నట్లుంది. అయినా శ్రీకర్ రావడానికి సమయముంది. "అసలు తను ముందే చెప్పుంటే శ్రీకర్ ఈపాటికి వచ్చుండేవాడు. త్వరగా తనని చూసుండేదాన్నిగదా. సర్లే! తను వచ్చేలోపల వంట ముగించి స్నానం చేసి రెడీగా ఉండాలి" అనుకుంటూ బెడ్‌పైన ఉత్తరాలవీ సర్దడం మొదలెట్టింది లావణ్య. అన్నీ తీసి టేబిల్ మీద పెడ్తూ చూసింది బ్రౌన్ కవర్. సాధారణంగా చూసుండకపోను కానీ కవర్ మీద తను రాసినట్టే 'శ్రీ'కి ప్రేమతో అని రాసుండడంతో ఎవరై ఉంటారాని తెరచి చూసింది.

ఎంత సేపయిందో తెలియదు. ఉత్తరాన్ని పట్టుకుని మంచం చివర అలానే బొమ్మలా కూర్చుండిపోయింది లావణ్య. ఎవరీ పిల్ల ప్రత్యేకించి తను రాసిన ఉత్తరాన్ని బెడ్రూమ్‌లో పెట్టుకుని ఉన్నాడంటే వ్యవహారం ఎంతవరకూ వచ్చిందో! రోజూ ఫోన్ చేసి నువ్వు లేకుంటే దిగులుగా ఉందని ఎంత ప్రేమ ఒలకబోసేవాడు. హమ్మో! వెనక ఎంత కథ నడిపిస్తున్నాడు. ఆ పిల్ల పేరెక్కడా విన్నట్టు లేదు. తెలీకుండా జాగ్రత్త పడుతున్నాడేమో. ఏదో నేను చెప్పకుండా రాబట్టి బయట పడింది. లేకుంటే పిచ్చిదాన్లా తన వేషాలకి మురిసిపోతూ ఉందునేమో.'

లోపల్లోపలే కుతకుతలాడిపోతోంది లావణ్య. రెణ్ణెల్ల క్రితం ప్రక్క ఊరికి ట్రాన్స్‌ఫరయింది లావణ్యకి. పోనీలే ప్రక్క ఊరే గదా, వారం వారం రావచ్చు, కొన్నాళ్ళకి ట్రాన్స్‌ఫర్ కోసం ట్రై చేద్దామని వెళ్ళి జాయినయింది. అక్కడికెళ్ళినప్పట్నుంచీ శ్రీకర్ వారం వారం వచ్చి వెళ్ళేవాడు. పూట పూటా ఫోన్ చేసి తింటున్నావా లేదా అని కనుక్కునేవాడు. రోజూ రాత్రిళ్ళు నిద్ర పట్టట్లేదురా, దిగులుగా ఉంది అంటే ఎంత మురిసిపోయేదో. పోనీలే గదా చటుక్కున వచ్చి ఆశ్చర్యపరుద్దామనుకుంది. వచ్చి తను ఆశ్చర్యంలో మునిగిపోక తప్పిందిగాదు.

షవర్ తిప్పి కూర్చుంది. ధారలుగా పడ్తూ ఒంటిని తడుపుతున్నాయి నీటి తుంపరలు. శూన్యంగా ఉంది. ఏడుపొచ్చినా బావుణ్ణు. 'ఇంతకీ ఆ పిల్ల తెల్లగా ఉంటుందేమో' పెళ్ళయిన కొత్తలో సంఘటన గుర్తొచ్చింది లావణ్యకి.

"మనిద్దరం కొన్ని కండిషన్స్ పెట్టుకుందాం" అడిగాడు శ్రీకర్.

"ఏమిటవి"

"మనం ఏ విషయానికయినా తగాదా పడ్డామనుకో నువ్వు ఎందుకు కోప్పడ్డావో మీ అమ్మావాళ్ళకో, మా అమ్మావాళ్ళకో చెప్పకుండా నాకే చెప్పాలి. అంటే నీ పాయింట్ ఆఫ్ వ్యూ ఎక్స్‌ప్లెయిన్ చెయ్యాలన్న

మాట" అన్నాడు. నిజంగా అర్థం కాలేదు లావణ్యకి. 'అయినా తనతో తగాదా వస్తే తనకే చెప్పమంటాడే విటీ, కొంచెం తిక్కా కొంపదీసి.'

లావణ్య ఫీలింగ్స్ చదివినట్టు నవ్వేసాడు శ్రీకర్. "మొద్దూ! మనిద్దరం ఫ్రెండ్స్. తగాదా వచ్చిందే అనుకో. నీ పాయింట్ ఏంటో నువ్వు చెప్పు. నా పాయింట్ నేనూ చెబ్తా. ఎవరి తప్పుంటే వాళ్ళు సారీ చెప్పేసి ముద్దు పెట్టాలన్నమాట. అలా గాకుండా పెద్దాళ్ళకు చెప్పావనుకో మధ్యన వాళ్ళు దూరి తీర్పు చెబ్తారు. మనిద్దరి మధ్య వేరే వాళ్ళు తీర్పు చెప్పడం ఛండాలంగా ఉంటుంది గదా"

మరోమారు "నేను నల్లగా ఉన్నాను గదా నీకెట్లా నచ్చాను" అనడిగింది.


"నువ్వు నల్లగా ఉంటే ఏంటి. నువ్వు చూడగానే నచ్చావు. నీతో జీవితం హాయిగా ఉంటుందన్పించింది. అయినా నువ్వు అందంగా ఉండవని ఎవరన్నారు. నువ్వు నవ్వితే చాలా బావుంటావురా. బాపూ బొమ్మకు చీర కట్టినట్టూ బావుంటావు. కావాలంటే నా కళ్ళతో చూడమను. చామనచాయ అనర్హత కానే కాదు. అలా అయితే తెల్లగా ఉన్నవాళ్ళంతా అందగత్తెలా. ఇంకెప్పుడూ అలా ఫీల్ అవకు. నిన్నెవరయినా కామెంట్ చేసినా చెప్పు వాళ్ళకి శ్రీకి నేనిలా ఉండడమే ఇష్టమని. లోపాన్ని ఎత్తి చూపి మాట్లాడేవాళ్ళు ఫ్రెండ్స్ కారు. వాళ్ళ గురించి బాధపడకు" తర్వాతెన్నడూ తన రంగు లావణ్యాని బాధపెట్టలేదు.

'ఇప్పుడేవిటి చేయడం. తను రాగానే అడిగితే అబద్ధం చెబ్తాడేమో' త్వరత్వరగా స్నానం ముగించి తల తుడుచుకుంది. ఉత్తరం చదవకముందు స్నానం చేసి కట్టుకోవాలని తీసి పెట్టుకున్న క్రీమ్ కలర్ షిఫాన్ చీరని విసిరేయ బుద్ధవుతోంది.'ఎందుకు స్పెషల్గా



రెడీ అవడం, అక్కడెవరో తనకోసం రోజూ రెడీ అవుతూనే ఉన్నట్టున్నారు గదా!'

అలమరలో నల్లనైటీ కోసం వెదికింది. దాన్ని వేస్కున్న ప్రతిసారీ దీనంగా మొహంపెట్టి బ్రతిమాలేవాడు శ్రీకర్. "నువ్వు నన్ను కరుణించి ఆ నల్లనైటీ వేసుకోకే. కావాలంటే కొత్త చీరలు కొనిస్తా. దెయ్యంలాగా ఆ నైటీ ఏంటీ? పైగా నల్లది" అప్పట్నుంచీ కోపమొస్తే నల్లనై




టీనే!

'సమయానికి దొరికి చావదు. సరే! ఏడవనీ..చీరకట్టే మాత్రం తగాదా వెయ్యనన' గబగబా చీరకట్టుకుని వంట కుపక్రమించింది. పొద్దున గిన్నెల్లో కాసింత అన్నం, చారు తప్ప ఏమీ కన్పించలేదు. 'అయ్యో పాపం, ఏమీ వండుకున్నట్టు లేదు. కాసింత కూరన్నా చెయ్యాలి'.

మిక్సీ హోరులో ఆలోచనా సుడులు 'అన్నీ చెబ్తాననీ ప్రామిస్ చేసాడుగా. ఇది కావాలనే చెప్పలేదేమో..నిజమే! మనీషా కొయిరాలా అంటే ఎంతిష్టం అని అడిగితే- "అది సినిమా హీరోయినే బాబూ, నేను అడుక్కున్నా తిరిగి చూడదు. దానిక్కూడా జెలసీలే" అంటూ జోకులు. అంతే! మగబుద్ధి అంతా అంతే. అసలందుకే తను ఉద్యోగం వదిలేస్తానంది. ఎంత క్లాసు పీకాడు.

"వద్దు బుజ్జీ. ఉద్యోగం జీతం కోసమే కాదు. నాలాగే నువ్వూ చదువుకున్నావు. నీకూ ఓ వ్యక్తిత్వం, గుర్తింపూ ఉండాలి. కేవలం ఇంటికి పరిమితమైపోకు. నీకు ఇంట్లో ఉండాలనుకుంటే మానెయ్. కానీ నా మటుకు నేను ఆడవాళ్ళకి ఆర్థిక స్వాతంత్ర్యముండాలని నమ్ముతాను. మరి నీ ఇష్టం"

'బాబోయ్! ఆ క్లాసు బదులు కొద్దిరోజులు కష్టపడడమే మేలు. రాజారామ్మోహనరాయ్‌లాగా స్త్రీ, స్వాతంత్ర్యం అంటూ క్లాసుపీకి, తను స్వతంత్రంగా తిరుగుతున్నాడు కాబోలు. అసలు తనకి బుద్ధుండాలి. తనెందుకు కూర చెయ్యడం. కూరలో ఒక స్పూను కారం గాదు 100 స్పూన్ల కారం వేసి చంపాలి'

అంత కోపంలోనూ నవ్వొచ్చింది లావణ్యకి. నిజంగా తనది ఉడుకుమోత్తనమో, అనుమానమో తేల్చుకోలేకుంది. ఇప్పుడు శ్రీ వచ్చి నవ్వుతూ మాట్లాడ్తే కోపమంతా ఎగిరిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదు. వీక్‌నెస్సయి కూర్చున్నాడు. అయినా సరే సీరియస్‌గా ఉండాలి! మనసు మూలలో ఎక్కడో తను అట్లాంటి వాడు కాదని ప్రేమ సొదపెడుతోంది.

ఏడవుతుండగా వచ్చాడు శ్రీకర్. తలుపులు తెరిచి, లైట్లు వేసుండడం చూసి కంగారుపడ్డాడు. దొంగలయితే గిన్నెల చప్పుడెందుకు విన్పిస్తుంది. వంట గదిలో తడి కురులని వాలు ముడి వేసుకుని వంట చేస్తున్న లావణ్యని చూడగానే తన కళ్ళని తానే నమ్మలేకపోయాడు.

"లవ్వూ! ఎప్పుడొచ్చావురా, ఫోన్ కూడా చెయ్యలేదే" సుడిగాలిలా చుట్టేసి గిరగిరా తిప్పేసాడు శ్రీకర్. పరిశీలనగా శ్రీకర్ మొహంలోకి చూసింది లావణ్య. 'తన సంతోషంలో నటన లేదు. మరి ఆ లెటర్ ఏవిటి'

"అసలు నువ్వొస్తున్నట్టు చెబ్తే నేను మధ్యాహ్నామే వచ్చేవాడిని. ఊరికొచ్చి కూడా ఎంత టైమ్ వేస్ట్ చేశావు" ఇంకా శ్రీకర్ గొంతులో ఉత్సాహం తగ్గలేదు. సాలోచనగా ఉన్న లావణ్యని చూసి కంగారుపడ్డాడు శ్రీకర్.

"ఏరా ఒంట్లో బాలేదా. ఏంటలా ఉన్నావు. ఆఫీసులో ఏమైనా ఇబ్బందా? ఎవరితోనన్నా గొడవపడ్డావా?"

"ఏం లేదు. ముందు స్నానం చేసిరా" ముభావంగా అంది. స్నానం చేసినంత సేపూ ఆలోచించినా శ్రీకర్ బుర్రకి కారణం బోధపడలేదు. తల తుడుస్తుందని చూశాడుగానీ అట్లాంటి ఆలోచన లేనట్టూ నిలబడుంది లావణ్య. అలమరలో లుంగీ తీసుకుంటూ చూశాడు ఎదురుగ్గా ఉండాల్సిన పోస్టర్ లేదు. లావణ్య ముచ్చటపడి అంటించిన అమ్మాయి, అబ్బాయి ముద్దు పెట్టుకుంటున్న పోస్టర్ అది. అమ్మాయి, అబ్బాయిల బుగ్గల మీద పేర్లు కూడా రాసింది ఇది మనిద్దరం అంటూ. రోజూ నవ్వుకునేవాడు దాన్ని చూసి. గది నిండా లావణ్య జ్ఞాపకాలే.


"లావణ్యా! ఇక్కడి పోస్టర్ ఏదీ"

"పోస్టర్ ఎందుకు. నాకు పిచ్చిగనక అట్లా పోస్టర్ అంటించా. అందుకే నేనే చింపేసా"

"ఎందుకు చింపడం..ఆల్వేస్ శ్రీ ఈజ్ యువర్స్. ఎందుకు డౌటు"

"చాల్లే ఆపు. సిగ్గులేకుండా ప్రేమలేఖలు బెడ్రూమ్‌లో పెట్టుకుని.." అరగంట దడదడ లాడించేసింది లావణ్య. వేసుకున్న చొక్కాకి గుండీలు పెట్టుకోవాలన్న స్పృహ కూడా లేకుండా నిలుచుండిపోయాడు శ్రీకర్.

"ఏమని రాసింది నీ లవర్ ఉత్తరంలో-నువ్వు ఇంద్ర సినిమాలో చిరంజీవిలాగా ఉంటావా. తీసెయ్. నువ్వు రేపొద్దున మీసాలు తీసెయకుంటే మనకి విడాకులు ఖాయం"




కోపం స్థానంలో లావణ్యని దుఃఖం ఆక్రమించుకుంది. దగ్గరికెళ్దామని చూసాడు గానీ భయంగా ఆగిపోయాడు శ్రీకర్. 'రాక్షసి! పైనబడి పీకినా పీకుతుంది. అసలే గోళ్ళు పెంచుకునుంటుంది కూడానూ'

"లవ్వూ నీకు నా మీద అనుమానమా?" లావణ్య మనసులో ఉన్నదేవిటో తనకే తెలీని పరిస్థితి.

శ్రీకర్ మెల్లిగా చెప్పనారంభించేడు. "ఆ పిల్ల మా ఆఫీసులోనే క్యాజువల్ టైపిస్టు. ఏదో రోజూ హుషారుగా తిరుగుతూ నవ్విస్తుంటానని క్రేజుండొచ్చు. చిన్నపిల్లరా. ఓసారి డబ్బు కావాలంటే సాయం చేసా. డిగ్రీ ప్రైవేటుగా చదువుతోంది. బాగా చదువుకోమని చెప్పేవాడ్ని. తెలుగు సినిమాలెక్కువ చూస్తుందేమో. ఇదే ప్రేమనుకుంది. అమాయకత్వం. కూర్చోబెట్టి మాట్లాడాక సారీ చెప్పింది. నీకా లెటర్ చూపిస్తే కుళ్ళుకుంటావని తెచ్చిపెట్టా. అది నన్నిలా కుళ్ళబొడుస్తుందనుకోలేదు. నిజంరా" దీనంగా మొహం పెట్టాడు.

తలెత్తి శ్రీ మొహంలోకి చూసింది. తన కళ్ళలో అదే నిర్మలత్వం. "మరి పోయిన వారం ఊరికి వచ్చినప్పుడు ఎందుకు చెప్పలేదు"

"నేను వచ్చేదే రెండు రోజులు. ఇట్లా పోట్లాడి ఆ కాసింత టైమ్ వేస్ట్ చేసుకోవడం ఇష్టం లేక చెప్పలేదు. ఇంత చిన్న కారణానికి మన టైమ్ పాడు చేసుకోవడం ఎందుకని"

"మరి నీకా పిల్ల మీద నిజంగా ప్రేమ లేదా" అమాయకంగా అడిగింది.

"నాకు ఆ పిల్ల మీద కాదు ప్రేమ, ఈ లవ్వు మీదుంది" అనడంతో ఒక్కసారిగా శ్రీ గుండెల మీద వాలిపోయింది లావణ్య.

"లావణ్యా, నాకు మనీషా కొయిరాలా ఇష్టమనీ, మరోటనీ అంటే నువ్వు ఉడుక్కుంటే సరదాగా ఉంటుంది. నామీద ప్రేమ ఉంటేనేగదా కుళ్ళుకుంటావు. కానీ కుళ్ళు వేరు, అనుమానం వేరురా. ఉడుకుమోత్తనం సరాగాలకి కొత్తవాసన మోసుకొస్తుంది. కానీ అనుమానం సంసారాన్నే కాల్చేస్తుంది. వద్దు బంగారూ! ఎవరికోసమనో నేన్నిన్నెప్పటికీ వదులుకోను. నన్ను నమ్ము."

నుదుటిపై శ్రీకర్ ముద్దు 'నేను నీకే' అన్న భరోసాలా తోచింది. అనుమానాలన్నీ తీరిపోయిన శ్రీ గుండెల్లో ఒదిగిపోయింది లావణ్య.

ఇంకెప్పటికీ వాళ్ళాయన చిరంజీవిలా ఉన్నాడనుకుని మాత్రం మురిసిపోదు లావణ్య. నిజం.